నమస్తే తెలంగాణ
# సూర్యాపేట
5 | నల్లగొండ, శనివారం 2 నవంబర్ 2024 | SURYAPET

## కార్యకర్తల కుటుంబాలకు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పరామర్శ

నాగారం, నవంబర్ 1 : నాగారం మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఇద్దరు ఇటీవల మృతిచెందగా, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి శుక్రవారం ఆయన కుటుంబాలను పరామర్శించగా, మర్రిపెల్లా రాములు, వద్దిగళ్ల మహేశ్ అనారోగ్యంతో చనిపోగా, వారి ఇండ్లకు వెళ్లి చిత్రపటాల వద్ద నివాళి అర్పించారు. బీఆర్‌ఎస్ పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండగాని అంబయ్య, మాజీ ఎంపీపీ కూరం మణి వెంకన్న, బీఆర్‌ఎస్ నాయకులు చిప్పలపల్లి సోమయ్య, దోమల బాలమల్లు, రాములు, మల్లేశ్ ఉన్నారు.



నాగారంలో కార్యకర్త చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

# కొనుగోళ్లలో జాప్యం..
# తడిసి ముద్దయిన ధాన్యం
## నల్లగొండ రైతుల ఆక్రందన

నల్లగొండ రూరల్, నవంబర్ 1 : అన్నదాతలు కష్టపడి పండించిన ధాన్యం ప్రభుత్వం నిర్లక్ష్యంతో కొనుగోలు కేంద్రాల్లోనే తడిసి ముద్ద అవుతున్నది. నల్లగొండ జిల్లాకేంద్రం శివారులోని కొనుగోలు కేంద్రంలో రవాణాలో జరిగిన జాప్యం కారణంగా ఎక్కడి ధాన్యం రాశులు అక్కడే ఉన్నాయి. బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు మూడు గంటలకుపైగా కురిసిన వడ్లు వరదలో కొట్టుకుపోయాయి. ఆర్జాలబావి కొనుగోలు కేంద్రంలో 84 కుప్పలకు పైగా ధాన్యం 17 శాతమే తేమ ఉన్నప్పటికీ సకాలంలో లారీలు రాకపోవడంతో లోడ్ ఎత్తలేదు. మరోవైపు రెడ్డికాలనీ గ్రామంలో సెంటర్ ప్రారంభించి నాటి నుంచి కేవలం రెండు లారీలు మాత్రమే కొనుగోలు చేశారు. అక్కడా ధాన్యం భారీగా తడిసి కొంత వరకు వరదకు కొట్టుకుపోయింది. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు గురువారం రైతులు నానా అవస్థ పడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో వడ్లు సకాలంలో కొనేవారని చెప్పుకొచ్చారు.



నల్లగొండ మండలంలోని రెడ్డికాలనీ గ్రామంలో వర్షానికి తడిసిన ధానాన్ని ఎత్తుతున్న రైతు



నల్లగొండ శివారులోని ఆర్జాలబావిలో కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని ఎత్తుకుంటున్న రైతులు





బుద్ధవనం వ్యూ పాయింట్ వద్ద మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి, రామచంద్ర మిషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కమలేశ్ డి.పాటిల్

## బుద్ధవనం అభివృద్ధికి కృషి
- పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కష్ణారావు

నందికొండ, నవంబర్ 1 : నాగార్జునసాగర్ హిల్ కాలనీలో అంతర్జాతీయ స్థాయిలో నిర్మించిన బౌద్ధ వారసత్వ థీమ్ పార్కు బుద్ధవనాన్ని ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తామని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి, రామచంద్ర మిషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కమలేశ్ డి.పాటిల్ (దాజి)తో కలిసి శుక్రవారం నల్లగొండ జిల్లాలోని బుద్ధవనాన్ని సందర్శించారు. పక్కనే ఉన్న విపాసన ధ్యాన మందిరానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. బుద్ధవనంలోని వ్యూ పాయింట్ నుంచి కృష్ణా నది వెంట నల్లమల అందాలను వీక్షించారు. అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ ప్రపంచ దేశాల నుంచి వచ్చే పర్యాటకులు, బౌద్ధ గురువులకు తగిన వసతులు సమకూర్చుతామన్నారు. సాగర్‌ను అభివృద్ధి చేయడానికి పర్యాటక శాఖ తరుపున ప్రత్యేక చర్యలను తీసుకుంటామని తెలిపారు. బుద్ధవనంలోని 270 ఎకరాలు, విజయ విహార్‌లో ఉన్న ఖాళీ స్థలం వివరాలతోపాటు అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను సర్వే చేసి వివరాలు సమర్పించాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్‌ను ఆదేశించారు. బుద్ధవనం పరిసరాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో స్టార్ హోటళ్ల నిర్మాణం, నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లో వాటర్ స్పోర్ట్స్‌ను అభివృద్ధి చేయడానికి హైదరాబాద్ సమీపంలోని రామచంద్ర విషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు దాజితో కలిసి బుద్ధవనాన్ని సందర్శించినట్లు తెలిపారు. అంతకుముందు మాజీ సీఎల్పీ నేత జానారెడ్డిని హిల్‌కాలనీలోని నివాసంలో మంత్రి జూపల్లి, దాజీ కలిశారు. కాగా, బుద్ధవనంలో స్థలం, లేదా సమీపంలోని ప్రభుత్వ స్థలాన్ని రామచంద్ర మిషన్‌కు ఇవ్వడానికే మంత్రి జూపల్లి పర్యటనకు వచ్చారని అధికార వర్గాల్లో గుసగుసలు వినిపించాయి. కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాశ్‌రెడ్డి, ఓఎస్డీ సుధాన్‌రెడ్డి, సహాయ శిల్పి శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.



సూర్యాపేటలో కాకరపూలు కాల్చుతున్న మహిళలు

## అంబరాన్నంటిన దీపావళి

రామగిరి, నవంబర్ 1 : ఇంటి ముంగిళ్లలో దీపాల కాంతులు. పోటాపోటీగా పటాకుల మోతలు.. ఆకాశంలో మిరిమిట్లు గొలిపే వెలుగులతో దీపావళి పండుగ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అంబరాన్నంటింది. ప్రజలు గురు, శుక్రవారం రెండు రోజులు పండుగ చేశారు. నరక చతుర్ధి సందర్భంగా గురువారం తెల్లవారుజామున నివాళి పట్టారు. ఆ రోజు సాయంత్రంతోపాటు శుక్రవారం కేదారేశ్వర నోములు, లక్ష్మీపూజ చేశారు. శుక్రవారం కూడా అమావాస్య ఉండడంతో అమ్మవారిని కొలిచారు. సాయంత్రం నుంచి రాత్రి వరకూ చిన్నాపెద్ద ఉత్సాహంగా పటకాలు కాల్చారు.





దీపాలు వెలిగిస్తున్న మహిళలు

## సమగ్ర కుటుంబ సర్వేను పటిష్టంగా నిర్వహించాలి
**జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**

నల్లగొండ/నకిరేకల్/కట్టంగూర్/శాలిగౌరారం : నవంబర్ 1 : సమగ్ర కుటుంబ సర్వేను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. ఇండ్ల జాబితా తయారీ, సర్వే మెటీరియల్‌ను గురువారం కలెక్టరేట్‌లో ఆమె తనిఖీ చేశారు. సర్వే ప్రశ్నావళి, అవసరమైన ఫారాలు, స్టిక్కర్లు, ఇతర అన్ని రకాల సామగ్రి జిల్లాలోని ప్రతి ఎన్యుమరేటర్‌కూ చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ రాజకుమార్, ఏఓ మోతిలాల్ పాల్గొన్నారు. అంతకు ముందు నకిరేకల్, కట్టంగూర్, శాలిగౌరారంలో సర్వే తీరు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే ఎలా చేస్తున్నారనేది ఆరా తీసి ఎన్యూమరేటర్లకు సూచనలు ఇచ్చారు. 150 కుటుంబాలకు ఒక ఎన్యుమరేటర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు సర్వే సులభతరమయ్యేలా ప్రత్యేక ఫార్మాట్‌ను రూపొందించిన నకిరేకల్ మున్సిపల్ కమిషనర్ డి.బాలయ్యను కలెక్టర్ అభినందించారు. నకిరేకల్ మున్సిపాలిటీలోని చీమలగడ్డలో మొదటి విడుత సర్వేను ఆమె ప్రారంభించారు. కమిషనర్ తయారుచేసిన ఫార్మాట్‌ను అన్ని మున్సిపాలిటీలకు అందించే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. వారి వెంట తాసీల్దార్ ఎస్‌కె జమీరొద్దీన్, సూపర్‌వైజర్ ఉప్పల సంతోష్ ఉన్నారు.



నకిరేకల్ పట్టణంలో సర్వేలో భాగంగా మహిళతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, పక్కన మున్సిపల్ కమిషనర్ బాలయ్య



నల్లగొండ ఎన్‌జీ కాలేజ్ గ్రౌండ్‌లో సదర్ ఉత్సవాలను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

## సదర్ సంబురం
**ఎన్‌జీ కాలేజ్ మైదానంలో దున్నపోతుల విన్యాసాలు**

రామగిరి, నవంబర్ 1 : దీపావళి పండుగను పురస్కరించుకుని నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్‌జీ కళాశాల మైదానంలో గురువారం రాత్రి యాదవులు సదర్ సమ్మేళనం నిర్వహించారు. మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి హాజరై యాదవ ప్రముఖులతో కలిసి శ్రీకృష్ణుడికి పూజలు చేసి వేడుకలను ప్రారంభించారు.

హైదరాబాద్ నుంచి రప్పించిన దున్నపోతులను అలంకరించి ఎన్‌జీ కాలేజీ మైదానానికి డప్పు చప్పుళ్ల మధ్య తీసుకువచ్చారు. ఈ సందర్భంగా దున్నపోతుల విన్యాసాలు అబ్బురపర్చాయి. సదర్ సంబురాన్ని చూసేందుకు జిల్లా కేంద్రంతోపాటు పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. సదర్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మద్ది శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అఖిల భారత యాదవ సభ జిల్లా అధ్యక్షుడు ముచ్చర్ల ఏడుకొండల్, యాదవ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తరాల పరమేశ్‌యాదవ్, యాదవ ప్రముఖులు పిల్లి రామరా జు, అల్లి సుభాశ్, లొడంగి గోవర్ధన్, మామిడి పద్మ, కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



దున్నపోతుల విన్యాసాలు

## మూసీలో ఇద్దరు బాలురు మృతి
- వలిగొండలో పండగ పూట విషాదం



కళ్లెం కిరణ్ (ఫైల్)



కళ్లెం జీవన్ (ఫైల్)


వలిగొండ, నవంబర్ 1 : పండుగ పూట సరదాగా చేపల వేటకు వెళ్లిన ఇద్దరు విద్యార్థులు ప్రమాదవశాత్తు మూసీ నదిలో పడి మృతిచెందారు. ఈ విషాధ ఘటన మండల కేంద్రంలో గురువారం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని జంగాల కాలనీకి చెందిన అన్నదమ్ముల పిల్లలు కళ్లెం కిరణ్ (11) 5వ తరగతి, కళ్లెం జీవన్ (13) 6వ తరగతి చదువుతున్నారు. వీరితోపాటు కళ్లెం వరుణ్ గురువారం సమీపంలోని మూసీ నదిలో చేపలు పట్టడానికి వెళ్లారు. మూసీ నది ఒడ్డున ఉండి చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు జారి కిరణ్ నీళ్లల్లో పడ్డాడు. నీటి ప్రవాహంలో కొట్టుకుపోతున్న కిరణ్‌ను రక్షించడానికి జీవన్ నీళ్లలోకి దూకాడు. ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిలో వారు మునిగి పోతుండగా వరుణ్ గమనించి పరిగెత్తుకుంటూ వచ్చి కుటుంబ సభ్యులకు, కాలనీ వాసులకు చెప్పాడు. కుటుంబ సభ్యులు, కాలనీ వాసులు హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకొని రక్షించే ప్రయత్నం చేసినటప్పటికీ ఫలితం దక్కలేదు. విషయం తెలుసుకున్న చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ యుగంధర్ ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి వెతికారు. కిరణ్ మృతదేహం లభ్యం కాగా.. జీవన్ ఆచూకీ లభించలేదు. దాంతో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను రప్పించి గాలింపు చర్యలు చేపట్టగా ప్రమాదం జరిగిన కొంత దూరంలో శుక్రవారం జీవన్ మృతదేహం లభ్యమైంది. విషయం తెలుసుకున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి ఘటన స్థలాన్ని సందర్శించి ప్రమాద వివరాలను పోలీసులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాలకు పంచనామా నిర్వహించి పోస్టుమార్టమ్ కోసం రామన్నపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగంధర్ తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు పిల్లలు మృతిచెందడంతో వలిగొండలో విషాధ చాయలు అలుముకున్నాయి.

## కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డికి కేంద్ర పతకం



కోదాడ డీఎస్పీ శ్రీదర్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, నవంబర్ 1 : జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా కేంద్ర పతకానికి సూర్యాపేట జిల్లా కోదాడ డీఎస్పీ మామిళ్ల శ్రీధర్‌రెడ్డి ఎంపికయ్యారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నేర పరిశోధనలో అత్యున్నమైన ప్రతిభాపాటవాలకు గుర్తింపుగా కేంద్ర హోం మంత్రి దక్షత పతకాన్ని ప్రకటించారు. 1998 నవంబర్‌లో సబ్ ఇన్స్పెక్టర్‌గా ఉద్యోగంలో చేరిన శ్రీధర్‌రెడ్డి ఉమ్మడి నల్లగొండ జిల్లా, రాచకొండ కమిషనరేట్, ప్రత్యేక నిఘా విభాగంలో పని చేశారు. ప్రతిష్టాత్మకమైన ఐక్యరాజ్య సమితి శాంతి పరిరక్షణ దళానికి దేశం తరపున ఎంపికై 2016-17లో హైతి దేశంలో పోలీస్ ఆపరేషన్ ప్లానింగ్ అధికారిగా పని చేశారు. సంచలనాత్మక హాజీపూర్ మైనర్ బాలిక లైంగిక దాడి, హత్య కేసులో నిందితుడిని సాంకేతికత నైపుణ్యాన్ని ఉపయోగించి తక్కువ సమయంలో అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించారు. నర్సింహుల గూడెం ఫ్యాక్షన్ హత్య కేసు, మరో మూడు హత్యలు, అనేక దోపిడీ, దొంగతనాల కేసుల దర్యాప్తు, కేసులను ఛేదించడంలో ప్రత్యేకత చాటారు. గతంలో పోలీస్ సేవ పతకం, తెలంగాణ రాష్ట్ర శౌర్య పతకం, ఉత్తమ సేవ పతాకం, తెలంగాణ ముఖ్యమంత్రి సర్వోన్నత పతకం, ప్రతిష్టాత్మక ఇండియన్ పోలీస్ మెడల్‌ను అందుకున్నారు. 2015లో పంజాబ్‌లో జరిగిన అఖిల భారత స్థాయి డ్యూటీ మీట్‌లో ఫోరెన్సిక్ సైన్స్ విభాగంలో రజత పతకం సాధించారు. 2017లో ఐరాస శాంతి పతాకాన్ని సాధించడంతోపాటు 200కి పైగా రివార్డులు, అవార్డులను పొందారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీధర్‌రెడ్డిని డీజీపీ జితేందర్, శాంతి భద్రతల అదనపు డీజీపీ మహేశ్‌భగవత్, జోనల్ ఐజీ సత్యనారాయణ, సూర్యాపేట ఎస్పీ సన్ ప్రీత్ సింగ్, ఏఎస్పీ నాగేశ్వర్ రావు అభినందించారు.



గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

## బీఆర్‌ఎస్‌లో చేరికలు

చందంపేట(దేవరకొండ), నవంబర్ 1 : బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో శుక్రవారం చేరికలు జరిగాయి. దేవరకొండ పట్ట ణంలోని 17వ వార్డుకు చెందిన దరమళ్ల వినయ్, 3వ వార్డుకు చెందిన ఎండీ నజీర్‌కు రవీంద్రకుమార్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ విఫలమైందని విమర్శించారు. రైతులందరికీ రుణమాఫీ చేయలేదని, వృద్ధులకు రూ.4వేల పింఛన్ ఇస్తామని చెప్పి ఇప్పటి వరకూ అమలు చేయలేదని గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ హయాంలోనే అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందాయన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు టీవీఎన్ రెడ్డి, బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డుపల్లి కృష్ణ, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్, మోహన్, పట్టణాధ్యక్షుడు మధు, బాబా, అఫ్రోజ్, చంద్రమౌళి, చాట్ల రాములు పాల్గొన్నారు.

## రైతుల పట్ల చిత్తశుద్ధి లేని ప్రభుత్వం
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్, నవంబర్ 1 : ఎన్నికల ముందు రైతులకు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కటీ అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. శుక్రవారం నకిరేకల్ పట్టణంలోని చీమలగడ్డలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మ్లాడుతూ పండించిన పంటలను కొనుగోలు చేయలేని దిక్కుమాలిన ప్రభుత్వం రాష్ట్రంలో ఉందన్నారు. కొనుగోలు కేంద్రాలను అట్టహాసంగా ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు తిరిగి వాటి వంక చూసే పరిస్థితి లేదన్నారు. కేసీఆర్ హయాంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన తరువాత మిల్లర్లతో మాట్లాడి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించామన్నారు. రైతుబంధు రూ.15వేలు, రైతులందరికీ రెండు లక్షల రుణ మాఫీ చేస్తామని ప్రగల్బాలు పలికిన కాంగ్రెస్ రైతులను మోసం చేసిందని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయడంతోపాటు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మాజీ పీఏసీఎస్ చైర్మన్ పల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సందినేని వెంకటేశ్వర్‌రావు, మండలాధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, మాజీ ఎంపీటీసీ ఇనుడపాక వెంకన్న ఉన్నారు.



నకిరేకల్ చీమలగడ్డలోని ధాన్యం కొనుగోలు కేంద్రంల రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

## ఐరాస అసెంబ్లీ సమావేశాలకు కోడూరువాసి



బ్రహ్మాచారి

సూర్యాపేట టౌన్, నవంబర్ 1 : సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం అర్వపల్లి మండలంలోని కోడూరు గ్రామానికి చెందిన మారోజు బ్రహ్మాచారికి అరుదైన గౌరవం దక్కింది. ప్రపంచ మానవ హక్కుల సమితి జాతీయ లీగల్ సెల్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఆయనకు ఐక్య రాజ్య సమితి నుంచి ఆహ్వానం అందింది. స్విట్జర్లాండ్ జెనివాలోని ప్రధాన కార్యాలయంలో నవంబర్ 4న జరుగనున్న ఐరాస అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనేందుకు పిలుపు వచ్చింది. సునామీ అవగాహన దినోత్సవ కార్యక్రమంలో బ్రహ్మాచారి వివిధ దేశాల ప్రతినిధులతో కలిసి బ్రహ్మాచారి పాల్గొననున్నారు. కాగా, తెలంగాణకు ఆయన ఒక్కరికే అవకాశం వచ్చింది.